
బీచుపల్లి తాగునీటి పథకం వద్ద నీరు లేక బోసిపోయిన కృష్ణానది

# బీఆర్ఎస్ జలదీక్ష

- నడిగడ్డ ప్రజల తాగునీటి గోస తీర్చాలని డిమాండ్
- నేడు గద్వాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే బండ్ల అధ్యక్షతన నిర్వహణ
- హాజరుకానున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

గద్వాల, ఏప్రిల్ 14 : నడిగడ్డ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి గోస తీర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం జలదీక్ష చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతోపాటు బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరుకానుండగా ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. నడిగడ్డ వరప్రదాయిని జూరాల డెడ్ స్టోరేజీకి చేరుకోగా.. తుంగభద్ర నది వట్టిపోవడంతో నడిగడ్డ ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. 2015–16 తర్వాత ఇంతగా నీటి సమస్య రావడం ఇదే తొలిసారి. కృష్ణా, తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో వర్షాభావంతో నదుల్లో నీళ్లు లేక ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి. జూన్–జూలైలో కొంత మేర వర్షాలు కురిసినా అక్టోబర్ తర్వాత వాన జాడలేకపోవడంతో జలాశయాలు వట్టిపోయాయి.

***మిషన్ భగీరథ ద్వారా..***

మిషన్ భగీరథ పథకం ద్వారా గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లోని 322 ఆవాసాలు, ఐదు మున్సిపాలిటీ పరిధిలో జూరాల జలాశయం నుంచి రక్షిత తాగునీటిని అందిస్తున్నారు. వీటితోపాటు గద్వాలలోని నదీఅగ్రహారం, జములమ్మ ఫిల్టర్‌బెడ్ నుంచి గద్వాలకు, బీచుపల్లి దగ్గర ఏర్పాటు చేసిన లిఫ్ట్ ద్వారా అలంపూర్ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు నీటిని సరఫరా చేసేవారు. అయితే, జూరాల డెడ్ స్టోరేజీకి చేరడంతో ప్రాజెక్టు దిగువకు నీరు రాలేదు. దీంతో నదీఅగ్రహారం వద్ద గద్వాల ప్రజలకు తాగునీరు అందించే కృష్ణా ఫిల్టర్ బెడ్ దగ్గర నీరు లేకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జములమ్మ ఫిల్టర్ బెడ్‌ద్వారా సగం గద్వాల పట్టణానికి నీరు అందించే జములమ్మ రిజర్వాయర్ వట్టిపోయే దశకు చేరుకోవడంతో ఏప్రిల్ చివరి నుంచి గద్వాల పట్టణ ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే అవకాశం ఉన్నది.

***వేసవి నుంచి గట్టెక్కేనా..?***

నడిగడ్డ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కావాలంటే ఎగువన ఉన్న నారాయణపూర్ డ్యాం నుంచి దిగువన ఉన్న జూరాలకు 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలి. అందుకోసం తెలంగాణ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి గద్వాల ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు నీటిని విడుదల చేయాలనే డిమాండ్‌తో ఎమ్మెల్యే బండ్ల జలదీక్ష చేపట్టనున్నారు. కర్ణాటక కనికరించి నీళ్లు విడుదల చేస్తే ఈ వేసవి నుంచి గద్వాల ప్రజలు గట్టెక్కే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో 3.043 టీఎంసీల డెడ్ స్టోరేజీలో నీటి నిల్వ ఉన్నది. ప్రతి రోజూ తాగునీటి అవసరాల కోసం 74 ఎంఎల్‌డీలు నీరు అవసరమని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. అయితే, ఈ నీరు ఈ నెల చివరి వరకు సరిపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మే నెలలో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉండడంతో గద్వాల ప్రజలకు అవసరమైన తాగునీరు అందించాలనే ఆలోచనతో ముందు చూపుతో జలదీక్ష ఎమ్మెల్యే చేపడుతున్న క్రమంలో ప్రజల నుంచి పూర్తి మద్దతు లభిస్తున్నది.


జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో జలదీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు



## శక్తివంచన లేకుండా పనిచేశా..

ఎంపీగా ఉన్న ఐదేండ్లలో రాష్ట్ర అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పనిచేశా. ముఖ్యంగా పాలమూరు యూనివర్సిటీకి రూ.50 కోట్లు, జాతీయ రహదారుల అభివృద్ధికి ఎంతో కృషి చేశా.రాష్ట్రాన్ని కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే ప్రథమస్థానంలో నిలిపారు. కేసీఆర్ హయాంలోనే రైతుల ముఖాల్లో సుఖసంతోషాలు చూశాం. రైతును రాజుగా చేశాం. అన్ని వర్గాల వారిని ఆదుకున్న కేసీఆర్‌ను వయస్సుతో సంబంధం లేకుండా విమర్శిస్తున్నారు. అబద్ధపు హామీలతో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎక్కడికి పోయారు. మూడు నెలలు దాటినా ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదు. బీజేపీ నాయకులు అయోధ్యలో గుడి కట్టి, అక్షింతలు పంపించి ఓట్లు అడగడం విడ్డూరం. ప్రజలకు మేలు చేసి ఓట్లు అడగాలి. స్థానికుడినైన నాకు రెండోసారి అవకాశం కల్పిస్తే జీవితాంతం మీకు రుణపడి పని చేస్తా. నాపై కేసీఆర్ ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయను.

*- మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ*


నవాబ్‌పేటలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వేదికపై ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

- అప్రమత్తంగా ఉండకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకమే..
- సంక్షేమ పథకాలను తుంగలో తొక్కిన కాంగ్రెస్
- వందరోజుల పాలనలో ప్రజల అష్టకష్టాలు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- భూత్పూర్, నవాబ్‌పేటలో కార్యకర్తల సమావేశం

# ప్రజలు మేల్కోవాలి

భూత్పూర్/నవాబ్‌పేట, ఏప్రిల్ 14 : ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పే వారితో అప్రమత్తంగా ఉండి, గత ఎన్నికల్లో చేసిన పొరపాట్ల నుంచి గుణపాఠాలను నేర్చుకొని మేల్కోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఓటర్లు అప్రమత్తం కాకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో భూత్పూర్‌లోని కేఎమ్మార్ ఫంక్షన్‌హాల్‌లో.., మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నవాబ్‌పేట మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి డిసెంబర్ 9న రైతుల ఖాతాల్లో రూ.15వేలు రైతుబంధు వేస్తామని చెప్పారన్నారు. కల్యాణలక్ష్మి పథకంతోపాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చినా వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే హామీలన్నీ తుంగలో తొక్కడం ఖాయమన్నారు. అందుకే అందరూ ఆలోచించి పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన పొరపాట్లతో పల్లెలన్నీ వల్లకాడుగా మారుతున్నాయని, అంతులేని ముప్పు వాటిల్లబోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో గ్రామాలు, పట్టణాల్లో ఊహించని పనులు చేశామని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో క్షణికావేశంలో, పార్టీలో కొంత సఖ్యత లేక పొరపాట్లు చేశారని, వచ్చే ఎన్నికల్లో అలాంటి తప్పులు దొర్లవద్దని కోరారు. కాంగ్రెస్ 100 రోజుల పాలనలో ప్రజలు జీవితంలో ఎప్పుడూ పడని కష్టాలు పడుతున్నారని ఆరోపించారు. తాగునీరు దొరకక వాటర్ ట్యాంకులు దర్శనమిస్తున్నాయని తెలిపారు. వరి చేలు ఎండిపోయాయని, కరెంట్ కాటగలిసిందని, రైతుబీమా, రైతుబంధు లేవంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేద్దామని మనమంతా ఎంతో కృషి చేశామని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రజలంతా అప్రమత్తమై స్థానికుడైన మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో రెండోసారి ఎంపీగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అతివిశ్వాసంతోనే గత ఎన్నికల్లో ఓటమి చవిచూశామని, మళ్లీ అలాంటి పరిస్థితులు రానివ్వొద్దని సూచించారు. ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్‌కు మొదటి నుంచి అలవాటేనని, ప్రజలు అడుక్కుతినాలనే కోరుకుంటుందని ఎద్దేవా చేశారు. బీజేపీ ప్రభుత్వం గత పదేండ్లల్లో ధరలను పెంచడమే ధ్యేయంగా పెట్టుకున్నదని, ప్రజలకు చేసింది మాత్రం శూన్యమేనని ఆరోపించారు.


మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

మాట్లాడుతున్న ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి

దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసమని, అలాంటి రాష్ట్రాన్ని పరుల చేతుల్లో పెట్టడం చాలా బాధగా ఉందన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ సర్కారు 90 శాతం పూర్తి చేసిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును మూలన పడేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాల్వ పనులకు టెండర్ పూర్తైనా రద్దు చేయడం దారుణమన్నారు. అమలు కాని హామీలతో గెలిచి వాటిని పట్టించుకోకుండా మళ్లీ ఓట్లు అడగడం దారుణమని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలని సూచించారు. ఇప్పటికైనా గమనించి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నారాయణపేట మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ పార్టీ మూడోసారి అధికారంలోకి వస్తే రైతుల మోటర్లకు మీటర్లను బిగిస్తారన్నారు. 40 ఏండ్ల కాలంలో కోయిల్‌సాగర్ కింద ఒక ఎకరం పొలం ఎండిపోలేదని, ఈ చేతకాని సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాకం వల్ల ఈ సంవత్సరం దాదాపు వెయ్యి ఎకరాల వరకు పంట ఎండిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా తన సీటును కాపాడుకోవడం కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు. ఆయా కార్యక్రమాల్లో భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, బాలకోటి, రామకృష్ణ, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచులు నారాయణగౌడ్, సత్యనారాయణ, సాయిలు, మురళీధర్‌గౌడ్, అహ్మద్, సాధిక్, రాములు, ప్రేమ్, బీఆర్ఎస్ నవాబ్‌పేట మండలాధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, మాజీ ఎంపీపీ శీనయ్య, నాయకులు నాగిరెడ్డి, ప్రతాప్, చెన్నయ్య, గోపాల్‌గౌడ్, అబ్దుల్లా, నవనీతరావు, శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాదంలో తెలంగాణ అస్థిత్వం

- రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర
- కేంద్రానికి వత్తాసు పలుకుతున్న సీఎం రేవంత్
- గ్యారెంటీలు అమలు చేయలేక రోజుకో స్కాం పేరిట కాలయాపన
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్పీ

వంగూరు, ఏప్రిల్ 14 : కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల కారణంగా తెలంగాణ అస్థిత్వం ప్రమాదంలో పడిందని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు, ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం వంగూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముందే రాజ్యాంగాన్ని మార్చే ముసాయిదాను బీజేపీ సర్కారు తయారు చేసిందని, దానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మద్దతు పలుకుతున్నారన్నారు. 370 మంది ఎంపీలు గెలిస్తే తప్పకుండా ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని మారుస్తారన్నారు. రాహుల్‌గాంధీ బీజేపీని విమర్శిస్తుంటే రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీకి వత్తాసు పలుకడం పలు అనుమానాలకు తావిస్తున్నదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ రెండూ వేరు కాదని, ఇద్దరు కలిసి తెలంగాణను దోచుకునే పనిలో నిమగ్నమయ్యారన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు రోజుకో స్కాం పేరుతో సీఎం రేవంత్ లీకులిస్తూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా రెండు పర్యాయాలు పనిచేసిన కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదన్నారు. ఎంపీ రాములు 220రోజులు పార్లమెంట్‌కు హాజరై కేవలం ప్రశ్నలు మాత్రమే సభ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఆ రెండు పార్టీలకు ప్రజలు ఓటుతో సరైన బుద్ధి చెప్పాలని, బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో బీఆర్ఎస్ అచ్చంపేట ఇన్‌చార్జి నవీన్‌రెడ్డి, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు గణేశ్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లయ్యయాదవ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు లాలూయాదవ్, కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సురేందర్, నాయకులు జైపాల్‌రెడ్డి, ప్రశాంత్‌రావు, అంజి, రాజు, సైదులు, జంగయ్య, సాయిలు తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు, చిత్రంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

***బీఆర్ఎస్ సత్తా చాటుదాం..***

అచ్చంపేట, ఏప్రిల్ 14 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం ఉప్పునుంతలలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి గువ్వల మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గంలో మార్పు అన్నారు కానీ, కాంగ్రెస్ నాయకులు ఇసుక అక్రమ దందా, అక్రమ మైనింగ్ దందాగా, బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు, కేసులు పెట్టి బెదిరిస్తున్నారని, ప్రజలు ఇలాంటి మార్పును కోరుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలన వందరోజులు దాటినా నేటికీ వారు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలంగాణలోని గురుకుల విద్యార్థులకు మంచి విద్యను అందించారని, ప్రజల బాధ తెలిసిన నాయకుడిగా మన ముందుకు వస్తున్నారు కాబట్టి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రవీణ్ కుమార్‌ను భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. సాధ్యం కాని హామీలను ఇచ్చి ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేస్తూ కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సోషల్ మీడియా సమన్వయకర్త అభిలాష్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్‌రావు, నాయకులు కట్టా గోపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


వనపర్తిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి


మహబూబ్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



గద్వాల జిల్లా కేంద్రంలో పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ జయంతి
- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు, ప్రజా సంఘాల నాయకులు

# బాబా సాహెబ్‌కు పుష్పాంజలి

***రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా ఆదివారం ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు మంత్రి, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాసంఘాలు, కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బాబాసాహెబ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. అంటరానితనం, అసమానతలను రూపుమాపేందుకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన మహానుభావుడని కొనియాడారు.***

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 14*


కొల్లాపూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

# అయ్యో.. మహాలక్ష్మి!

- ఆదేశాలు బేఖాతరు చేస్తున్న డ్రైవర్లు
- బస్సులు ఖాళీగా ఉన్నా నిలుపని వైనం
- గంటల తరబడి వేచిచూస్తున్న మహిళలు

మూసాపేట, ఏప్రిల్ 14 : ఒకప్పుడు ఆర్టీసీ అంటేనే ప్రత్యేక స్థానం ఉండేది. ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలని, ఆర్టీసీ ప్రయాణం ఎంతో సురక్షితం అంటూ, చెయ్యి ఎత్తిన చోట ఆపాలనే నినాదాలు, ఆదేశాలు ఉండేవి. కానీ ఇప్పుడు తెలంగాణ ఆర్టీసీ బస్సు ప్రయాణం అవస్థలమయంగా మారింది. బస్సులు ఆపడమే గగనమైంది. జాతీయ రహదారి రోడ్డు పొడవునా ఉన్న గ్రామాల్లో ప్రతి స్టేజీ వద్ద ప్రయాణికులు పదుల సంఖ్యలో వేచి ఉన్నా ఆర్టీసీ బస్సులు ఆపకుండా వెళ్తున్నాయి. ఉచితాల పేరుతో బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు ప్రతి రోజూ అవస్థలు పడుతున్నారు. డ్రైవరన్నకు నచ్చితే ఆపినట్లు లేకుంటే లేదు. వారి ఇష్టంపై ఆయా స్టేజీల ప్రజల ప్రయాణం ఆధారపడి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో గంటల తరబడి వేచి ఉన్నా బస్సులు ఆపకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం గద్వాల డిపోకు చెందిన టీఎస్ 33టీ2477 ఆర్టీసీ బస్సు ఉదయం 6:41 నిమిషాలకు మూసాపేట స్టేజీ వద్దకు వచ్చింది. కానీ అప్పటికే హైదరాబాద్‌కు వెళ్లేందుకు గంట ముందు నుంచే ఆ బస్సు కోసం ప్రయాణికులు వేచి ఉన్నారు. కానీ ఆ బస్సు ఖాళీగా ఉన్నా ప్రయాణికులు ఎంత మంది చెయ్యి పైకెత్తి రోడ్డుపైకి వెళ్లి ఆపినా ఆపకుండా వెళ్లారు. దీంతో ప్రయాణికులు అక్కడి నుంచి ఇతర వాహనాల ద్వారా జడ్చర్ల, భూత్పూర్, మహబూబ్‌నగర్‌కు వెళ్లిపోయారు. దీంతో బస్సు ఆపకుండా వెళ్లిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్టీసీ సిబ్బంది మాత్రం బస్సు ఆపుకుంటూ వెళ్తే ప్రయాణికులు ఓవర్ లోడ్‌గా ఎక్కుతున్నారని చెప్పుకొస్తున్నారు. కానీ ప్రతి రోజూ దాదాపుగా అన్ని బస్సులు ఆపకుండా వెళ్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మూసాపేట స్టేజీ వద్ద ప్రయాణికులు చెయ్యెత్తినా ఆపకుండా వెళ్తున్న బస్సు